కోట దుర్గమ్మను దర్శించుకున్న కలెక్టర్

పాలకొండ : పట్టణంలోని కోట దుర్గ అమ్మవారిని మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు అమ్మవారి పటాన్ని అందజేస్తున్న ఆలయ ఇఒ

ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైకోర్టు విశ్రాంత స్పెషల్ ఎపిపి ఎన్.శ్రావణ్ కుమార్ కోట దుర్గమ్మ వారిని దర్శించుకున్నారు.

చర్చలు విఫలం

- డిమాండ్ల ఆమోదానికి ప్రభుత్వం నిరాకరణ
- 3నుంచి పిహెచ్ సిల్లో వైద్య సేవలు బంద్
- జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో వైద్యుల ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘంతో చర్చలు విఫలం కావడంతో పిహెచ్‌సి వైద్యులు సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఈనెల 3నుంచి విధులను బహిష్కరించనున్నారు. దశలవారీ ఆందోళనలో భాగంగా మంగళవారం పిహెచ్ సి వైద్యుల సంఘం ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో వైద్యులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల పిజి కోటా పెంచాలని, ఏజెన్సీ అలవెన్సులు కల్పించాలని, ప్రమోషన్ కల్పించాలని కోరుతూ వైద్యుల సంఘం నాయకులు కొద్దిరోజుల క్రితం ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చారు. ఈనెల 2లోగా డిమాండ్లు ఆమోదించకపోతే 3నుంచి విధులను బహిష్కరిస్తామని సమ్మె నోటీసు అందజేశారు. అయితే ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో పిహెచ్‌సి వైద్యులు ఆందోళన తీవ్రతరం చేయడానికి సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా పట్టణంలో జిల్లాలోని పిహెచ్‌సి వైద్యులంతా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందంటూ వారు సమ్మె వైపు అడుగులు వేస్తున్నారు. ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న వైద్యులకు పిజి కోటా ఎక్కువ అమలు, ఏజెన్సీ అలవెన్సులు అమలుపై పిహెచ్ సి వైద్యులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. కొండ కోనల్లో వైద్య సేవలందిస్తున్న తమ పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటంపై పోరుబాట పట్టారు.

కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వైద్యాధికారులు

డిమాండ్లు ఆమోదించకపోతే సమ్మె

డాక్టర్ వినోద్ కుమార్, పిహెచ్ సి వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మంగళవారం రాత్రి స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిహెచ్‌సి వైద్యుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ పిహెచ్‌సి వైద్యుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 20శాతం ఉన్న పిజి కోటాను 15 శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు.ఏరియా ఆసుపత్రి, సిహెచ్‌సిల్లో పని చేస్తున్న వైద్యులకు ఇస్తున్న ఏజెన్సీ అలవెన్సులు తమకూ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సంచార చికిత్స శిబిరాలకు వెళ్లే వైద్యులకు ఐదు వేల అలవెన్సు మంజూరు చేయాలని కోరారు. డిమాండ్లు ఆమోదించే వరకు ఆందోళన కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

వైద్యారోగ్యశాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు : డిఎంహెచ్‌ఒ

పిహెచ్‌సి వైద్యాధికారులు సమ్మె చేపడుతున్న నేపథ్యంలో జిల్లాలో వైద్య సేవలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కర రావు వెల్లడి చేశారు. జిల్లా పిహెచ్‌సి వైద్యుల సంఘం సమ్మె నోటీసు అందజేశారని ఈ మేరకు ప్రజారోగ్యం దృష్ట్యా వైద్య సేవలకు అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పిహెచ్‌సిల్లో వైద్య సేవలకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. పర్యవేక్షణకు డాక్టర్ టి.జగన్ మోహనరావును నోడల్ అధికారిగా నియమించామన్నారు.

పోరాడారు... సాధించారు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఆల్ఫా ఇన్ఫ్రా బాధితుల విజయం
నిర్వాసితులకు అనుకూలంగా తీర్పునిచ్చిన హైకోర్టు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / కొమరాడ

వారంతా అమాయక గిరిజనులు... అది ఓ మారుమూల గిరిజన గ్రామం... అయితేనేం... ఆల్ఫా ఇన్ఫ్రా అనే బడా కార్పొరేట్ కంపెనీపై పోరాడారు. చివరకు మెడవంచి విజయం సాధించారు. మాయమాటలతో కంపెనీ లాగేసుకున్న సాగు భూములను తిరిగి వెనక్కి తెచ్చుకున్నారు. వందలాది మంది సాగుదారులు తమ భూముల దరి దాపుల్లోకి ఇప్పటికీ చేరలేకపోతున్నప్పటికీ ఏడేళ్ల క్రితమే కోర్టు ఉత్తర్వుల ద్వారా తమ భూములపై సాగు హక్కులను తిరిగి సాధించుకున్నారు. ఆ గ్రామం మరెక్కడో కాదు... కొమరాడ మండలంలోని చినఖేర్జిల పరిధిలోని లింగన్నదొర వలస.

జిల్లాలోని కొమరాడ మండలంలో థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట పెదఖేర్జల, చినఖేర్జల, కోటిపాం, శివరాంపురం, రేగులపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 1100 ఎకరాల ప్రభుత్వ, జిరాయితీ భూములను 2010లో అప్పటి ప్రభుత్వం కారు చౌకగా కట్టబెట్టిన విషయం విధితమే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, భారీగా నష్టపరిహారం చెల్లిస్తామని, సకల సదుపాయాలతో పునరావాస కాలనీలు నిర్మిస్తామంటూ అప్పట్లో నాటి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం కలిసి నమ్మబకాయి. దీంతో ఆ అమాయక గిరిజనులు, రైతులు తమ భూములను తృణప్రాయంగా త్యాగం చేసేందుకు ముందుకొచ్చారు. కానీ, ఆ పరిశ్రమ కారణంగా ఉద్యోగాలిచ్చే పరిస్థితి లేదు సరికాదా పర్యావరణ సమస్యలు తలెత్తుతాయంటూ సిపిఎం, తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ఉద్యమించడంతో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కూడా పర్యావరణ అనుమతులను 2013లో రద్దుచేసుకుంది. దీంతో మోసపోయామని తెలుసుకున్న లింగన్న దొరవలస గ్రామ గిరిజనులు పోగొట్టుకున్న భూములను తిరిగి సాధించేందుకు పోరాట నాందిపలికారు. ఇందుకోసం ఇతర గ్రామాలను అప్పట్లో సంప్రదించినప్పటికీ అక్కడ పాలక ప్రతిపక్ష నేతల్లో పెద్దగా స్పందన లేకపోయింది. కేవలం 16 కుటుంబాలు ఉంటున్న లింగన్నదొరవలసలో చదువుకున్న వ్యక్తి ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. కంపెనీని నిలదీసి పోయిన భూములను రాబట్టుకోవాలన్న ఆలోచన ఉన్నప్పటికీ ఎలా సాధించాలో తెలియని పరిస్థితి. సరిగ్గా అదే సమయంలో హిరమక గంగారావు (గంగాధర్) డిగ్రీ పూర్తిచేసుకుని గ్రామానికి వచ్చాడు. అప్పటికే భూములు కోల్పోయి మోసపోయామన్న ఆవేదన, ఆందోళన అవగతం చేసుకున్నాడు. తాను నేర్చుకున్న విద్యను ఆచరణలో పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు ఆ యువకుడు. ఇందుకు అంగవైకల్యం కూడా అడ్డురాలేదు. అనుకున్నదే తడువుగా న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాడు. తెలివైనవారి ద్వారా న్యాయవాదులు, రిటైర్డు అధికారులను కలిసి తమ గ్రామానికి జరిగిన అన్యాయాన్ని వివరించాడు. వారి సూచనలు, సలహాలతో ఆల్ఫా ఇన్ఫ్రా మోసాలపై హైకోర్టులో కేసు వేశాడు. చివరకు సత్యం గెలిచింది. లింగన్నదొరవలసలోని మొత్తం 14మంది గిరిజన సాగుదారుల నుంచి తీసుకున్న భూములను తిరిగివారికి అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించింది. దీంతో సాగుదారులు హాయిగా తమ భూములను సాగుచేసుకుంటూ జీవనం వల్లదీస్తున్నారు. ఇంతటి విజయానికి కారకుడైన గంగాధర్ ప్రజాదరణ పొందాడు. 2019 ఎన్నికల్లో ఆయన్ను చినఖేర్జిల సర్పంచిగా పది గ్రామాలకు చెందిన ప్రజానీకం ఓట్లేసి గెలిపించుకున్నారు.

అన్ని గ్రామాలూ న్యాయం పొందవచ్చు

తమ మాదిరిగా మిగిలిన గ్రామాలూ న్యాయం పొందవచ్చు. అది నా ఆకాంక్ష. అయితే, ఇందుకోసం ఆయా గ్రామాల నాయకత్వం ముందుకు రావాలి. కంపెనీ అప్పట్లో ప్రజల్ని మభ్యపెట్టి మోసం చేసింది. ఇందులో అధికార యంత్రాంగం పాత్ర కూడా ఉంది. ఇప్పటికీ తగిన సమాచారం ఇవ్వడం లేదు.

హిరమక గంగాధర్
చినఖేర్జిల సర్పంచి, కొమరాడ మండలం

ఏర్పాట్లును పరిశీలిస్తున్న మంత్రులు శ్రీనివాస్, అనిత, సంధ్యారాణి

నేడు సిఎం చంద్రబాబు జిల్లా పర్యటన

- దత్తి గ్రామంలో పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారులతో ముఖాముఖి
- టిడిపి నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి, దత్తిరాజేరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో పర్యటించనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయన ఉదయం 11 గంటల సమయంలో దత్తి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. నేరుగా ప్రజావేదిక వద్దకు వెళ్లి ప్రసంగిస్తారు. అనంతరం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటారు. అనంతరం 2.30 గంటలు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, 4గంటల సమయంలో తిరుగు ప్రయాణం అవుతారు.

సిఎం పర్యటన ఇలా..

విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ నుండి బుధవారం 11.20 గంటలకు హెలికాప్టర్లో బయలు దేరి 11.30 గంటలకు దత్తి గ్రామానికి చేరుకుంటారు. దత్తి లో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక వద్దకు 11.50 గంటలకు చేరుకుంటారు. 11.50 నుండి 12.05 వరకు పింఛన్ల పంపిణీ చేస్తారు. 12.10 నుంచి 1.40గంటల వరకు దత్తి గ్రామంలో ప్రజా వేదిక సమావేశంలో పాల్గొని లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారు. 1.40 నుంచి 2.10 వరకు రిజర్వు లో ఉంటారు. 2.15గంటల నుంచి 3.45గంటల వరకు పార్టీ నాయకుల తో సమావేశమవుతారు. 3.50గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకొని హెలికాప్టర్ ద్వారా సాయంత్రం 5.40 గంటలకు ఉండవల్లిలో తన నివాసానికి చేరుకుంటారు.

సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

దత్తి గ్రామంలో సిఎం చంద్రబాబు నాయుడు బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో, అధికారులు నిర్వహిస్తున్న ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత, రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్‌పి ఎఆర్ దామోదర్, జెసి ఎస్.సేతు మాధవన్‌తో కలిసి సిఎం పాల్గొనే వేదికలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, బొబ్బిలి ఎంఎల్‌ఎ బేబీ నాయన, డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగంలో గిరిజనులకు ప్రత్యేక హక్కులు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత

ప్రజాశక్తి - పార్వతీపురం

భారత రాజ్యాంగంలో గిరిజనులకు ప్రత్యేక హక్కులు కల్పించబడ్డాయని విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. మండలంలోని పెద్దమరికి పంచాయతీ చినమరికిలో న్యాయ అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు, నియమాలు ప్రవేశపెట్టాయని పేర్కొన్నారు. గిరిజనులు వాటిపై అవగాహన కలిగిన ఉండాలన్నారు. గిరిజనుల సామాజిక సాధికారత, సమానత్వం, సంక్షేమం కోసం అనేక చట్టాలు, ప్రణాళికలు ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహానికి పాల్పడే వారికి కఠిన శిక్షలు పడే అవకాశం ఉందన్నారు. ప్రతి గిరిజనుడు ప్రభుత్వం కల్పించే పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అమ్మాయికి వివాహం జరిపించాలంటే కనీస వయసు 18 ఏళ్లు నిండాలని, అప్పుడే బాలికలు మానసికంగా ధైర్యంగా నిలబడగలదని తెలిపారు. చిన్న వయసులో వివాహమైన బాలికలకు పుట్టే పిల్లలు తక్కువ బరువుతో పుడతారని, ముందస్తు ప్రసవం వల్ల నవజాత శిశువుల జన్మించే అవకాశం ఉందని జడ్జి అన్నారు. చిన్న వయస్సు నుండే పోషకాహార, ఎదుగుదల లోపాలతో బాధపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అందువల్ల బాల్య వివాహాలు ప్రోత్సహించకూడదని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం కేంద్ర ప్రభుత్వం 1989లో అమలు చేసిందన్నారు. ఈ చట్టం ముఖ్యోద్దేశ్యం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులపై జరిగే కులపరమైన దూషణలు, హింస ఇతర అఘాయిత్యాలను నిరోధించడానికి ఈ చట్టం రూపొందించబడిందని వివరించారు. పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు మాట్లాడుతూ గిరిజనులు ఎవరిపై ఆధారపడకుండా పలు వృత్తులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారి జీవనానికి, సంస్కృతికి ఆధారమైన భూమి, అడవులను కాపాడుకోవడానికి ప్రభుత్వాలు కల్పించిన హక్కులు తోడ్పడతాయని తెలిపారు. గిరిజనులు కూడా తమ హక్కుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయండి

సత్ప్రవర్తనతో ఖైదీలు శిక్షను పూర్తి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆమె సబ్ జైలును తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. జైలు పరిస్థితులు, ఆహారం, వైద్య సౌకర్యాలు, ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి నాణ్యమైన ఆహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. జైలు రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. జైలులోని పలు విభాగాలను ఆమె పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఒక అడ్వకేట్, పారాలీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు అవసరమైన న్యాయసలహాలు అందిస్తారని చెప్పారు. ఖైదీల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తి సబ్ జైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఫిర్యాదులు, అభ్యర్థనలు, ఏమైనా సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సబ్ జైలు అధికారులు ఆదేశించారు. 70ఏళ్లు పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడేవారికి బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు. అనంతరం భద్రతా చర్యలు, పారిశుధ్యం, జైలులోని ఇతర సౌకర్యాలను పరిశీలించారు. తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా లీగల్ సెల్ ఆథారిటీ సెక్రటరీ ఎ.కృష్ణ ప్రసాద్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె. సౌమ్య జోష్ఫిన్, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకటరావు పార్వతీపురం రూరల్ సిఐ రంగనాథం, ఎస్ఐ సంతోషి కుమారి, తహసీల్దార్ సురేష్, సర్పంచ్ గంగ, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడానికి నిరసిస్తూ పట్టణంలోని ఇందిరాకాలనీలో గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఎస్సీ సెల్ జిల్లా విభాగం ఆధ్వర్యంలో వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైసిపి ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేసి రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ పేదలకు, దళిత వర్గాలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయొద్దని ఆ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని, లేనిచో భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు మావుడి శ్రీనివాసరావు, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు, జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీ నాయుడు, పట్టణ, మండల వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బి.రమేష్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షులు లోలుగు నారాయణరావు, నియోజకవర్గాల ఎస్సీ సెల్ అధ్యక్షులు కోల సుధాకర్, మజ్జి అప్పారావు, జమ్మూ కన్నతల్లి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గండి భాగ్యవతి, కార్యదర్శి భూతల వెంకటరమణ, రాష్ట్ర ఆర్టిఏ విభాగం ప్రధాన కార్యదర్శి దేవుపల్లి నాగరాజు, కౌన్సిలర్లు నిమ్మకాయల సుధీర్, వండాన నేతాజీ, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విదార్థినులను ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

డిప్యూటీ డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - కురుపా

వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిప్యూటీ డిఎంఅండ్ హెచ్‌ఎ డాక్టర్ దుర్గాకళ్యాణి ఆదేశించారు. బాలికల గురుకుల వసతి గృహాల్లో చదువు తున్న పిల్లలు దసరా సెలవులకు ఇంటికి వెళ్లి ఆనారోగ్యంతో బాదపడుతున్నరని, వీరికి వైద్యసేవలు అందించాలని గిరిజన సంఘాలు కోరాయి. ఈ మేరకు మంగళవారం ఆమె మండలంలోని కస్పాగదబవలస, తదితర గ్రామాల్లో ఉన్న విద్యార్థుల ఆరోగ్యాలపై స్వయంగా డిప్యూటీ డిఎంహెచ్‌ఒ దుర్గా కళ్యాణి పరిశీలించి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అన్ని గిరిజన గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది పిల్లల ఆ రోగ్యంపై స్కీనింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఆనారోగ్యంగా ఉన్న పిల్లలను సంబంధిత పిహెచ్‌సిల్లో వైద్య సేవలు అందిస్తామన్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల ఆరోగ్యంపై వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఆ విద్యార్థినులకు ఏమైంది?

ఆసుత్రుల పాలైన కురుపాం బాలికల గురుకులం చిన్నారులు
ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఎపి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలోని విద్యార్థినిలంతా ఒకేసారి అనారోగ్యం పాలయ్యారు. దసరా సెలవులకు వెళ్లిన వీరు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. ఇదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కంబగూడకు చెందిన విద్యార్థిని పువ్వల అంజలి దసరా సెలవులకు ఇంటికి వచ్చిన 6 రోజుల్లోనే మృత్యువాతపడింది. హాస్టల్‌లో ఉన్నప్పుడే అంజలికి బాగోకపోవడంతో ఇంటికి పంపించమని కోరినా పాఠశాల సిబ్బంది పంపించలేదని విద్యార్థిని తల్లిదండ్రులు వాపోయారు. ఇలా ఒక్క అంజిలే కాకుండా మరో 15 మంది అనారోగ్యం బారినపడి హాస్టల్ నుంచి ఇంటికి చేరారు. అనారోగ్యంతో బాధపడిన వారిలో కురుపాం మండలం దండుసూర గ్రామానికి చెందిన తోయాక కల్పన, జియ్యమ్మవలస మండలం చినటోలుమండకు చెందిన సీమల నీరజను వైద్యం నిమిత్తం విశాఖపట్టణం కెజిహెచ్‌కు తరలించారు. పువ్వల హేమశ్రీ, పార్వతీపురంలోనూ, బిడ్డిక అమృత చినమేరంగి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. ఇంకా కొండగొర్రి అపూర్వ, కొండగొర్రి వైశాలి, కొండగొర్రి లావణ్య, కొండగొర్రి సరస్వతి, బిడ్డిక నిహారిక. అడ్డాకుల గీతిక, బిడ్డిక ధరణి, ఆరిక కృష్ణకుమారి, బిడ్డిక సంజయకుమారి అనారోగ్యం బారినపడి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెసిడెన్షియల్ స్కూల్ కమిటీ వైస్ చైర్మన్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సీతారాం, ఆదివాసీ గిరిజన సంఘం జియ్యమ్మ వలస మండల కార్యదర్శి గొరపాడు సోమయ్య రావాడ రామభద్రపురం పిహెచ్‌సిలో వైద్యం చేయించుకుంటున్న టికె జమ్ముకు కూరంగి సరస్వతి, కొండగొర్రి అఖిలప్రియను పరామర్శించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుతున్న 15 మంది విద్యార్థినిలు ఒకే రకమైన వ్యాధులతో బాధపడుతున్నారని, వీరంతా దసరా సెలవులకు ముందు స్కూల్‌లో అనారోగ్యానికి గురై ఇళ్లకు చేరారని, అందరికీ కడుపు నొప్పి, పచ్చ కామెర్లు, జ్వరం, రక్త హీనత వంటి లక్షణాలతో బాధపడుతున్నారని అన్నారు. స్కూల్‌లో డార్మెటరీ లేక ఒకే దగ్గర చదువు, పడుకోవడం జరుగుతుందన్నారు. అలాగే రూమ్‌ల్లో ఫ్యాన్లు, మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ సరిగ్గా పనిచేయకపోవడంతో విద్యార్థులకు మంచి నీరు అందుబాటులో లేదని అన్నారు. ఈ సమస్యలపై సమగ్ర విచారణ చేయాలని, సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే తల్లిదండ్రులను కదిలించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న గిరిజన సంఘం నాయకులు

పిహెచ్‌సిని సందర్శించిన డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సికి వచ్చిన రోగుల పట్ల సిబ్బంది వైద్య సేవలు, అలాగే వారి రికార్డులు, మందులను తనిఖీలు చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రోగుల పట్ల సిబ్బంది సత్ప్రవర్తనగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ వెంకటలక్ష్మి, స్టాఫ్‌నర్స్ మాదర్, యుడిసి మురళి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో రోగికి అందుతున్న వైద్యంపై ఆరా తీస్తున్న డిఎంహెచ్‌ఒ భాస్కరరావు

చెక్కులను అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

పేదలకు అండ... సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి - సాలూరు

వివిధ రకాల రోగాలతో బాధపడుతున్న పేదలకు నిరంతరం అండగా ఉండే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, ప్రతి ఒక్కరికీ సహాయం చేయాలనే ఉద్దేశంతో సిఎం సహాయ నిధి కింద అర్హులైన వారికి నగదు రూపంలో ఆసుపత్రులకు అయ్యే ఖర్చులు చెల్లిస్తున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి పేర్కొన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ గ్రామాల నుంచి సిఎం సహాయనిధికి ఎంపికైన వారికి చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు రూ.8,55,105 విలువైన పది చెక్కులను మంత్రి అందజేశారు. ఆర్థిక సాయం అందుకున్న లబ్ధిదారులు సిఎంకు, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిఎస్‌పి రాంబాబు

దసరా ఏర్పాట్లను పరిశీలించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపంలో గల నేరడవలసలో వెలసిన మాలతమ్మ గుడికి దసరా రోజున భక్తులు అధిక సంఖ్యలో చేరుకోనున్న నేపథ్యంలో మంగళవారం పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పై పి.నారాయణరావు తో మాట్లాడుతూ ప్రతి ఏటా మాలతమ్మకు మొక్కులు తీర్చుకొడానికి రెండు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో భారీకేడ్లు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మాలతమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువతతోనే మార్పు సాధ్యం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రాజకీయ మార్పులు అనేవి యువత చేతిలో ఉన్నాయని, సమాజ మార్పు వారితోనే సాధ్యమని మండల టిడిపి కన్వీనర్ మరడాన నారాయణస్వామి అన్నారు. మండలంలోని ఉల్లిభద్రకు చెందిన నారాయణస్వామి ఇటీవల మండల టిడిపి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయనకు మండల జనసేన తరపున మంగళవారం శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. పార్టీ ఇచ్చిన బాధ్యతలకు కొట్టుబడి ఉంటానని, అవకాశం ఉన్నంత వరకు మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు బోను శివ, ఉపాధ్యక్షులు అక్కేన శంకరరావు, లీగల్ సెల్ అడ్వకేటర్ కేతిరెడ్డి అశోక్ కుమార్, మండల నాయకులు మ(్రాపు రవికుమార్, వెంకటనాయుడు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ చేపట్టిన రైతు కూలీ సంఘం ఆనయకులు

ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్మించాలి

రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

వైసిపి హయాంలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ 17 కొత్త వైద్య కళాశాలల్లో పదింటిని పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించడం ఆందోళనకరమన్నారు. పది వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయాలని నిర్ణయించడం సరికాదన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.శ్రీను నాయుడు మాట్లాడుతూ 10 కళాశాలల పిపిపి నిర్ణయాన్ని ఉపసంహరించాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు కూలి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మొనంగి భాస్కరరావు, నాయకులు విశ్వేశ్వరరావు, ప్రసాదు, అసిరి పిడిఎస్ఒ నాయకులు సురేష్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

బూర్జిలో జంగిల్ క్లియరెన్స్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జిలో సువర్ణముఖి నదికి ఆనుకుని ఉన్న నీలాంటి రేవుకు ఇరువైపులా ఉన్న తప్పలు, డొంకలతో నిండి ఉండడంతో గ్రామ సర్పంచ్ దాస్ ఆధ్వర్యంలో మంగళవారం జెసిబితో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాటు కోళ్లకు భలే గిరాకీ

ప్రజాశక్తి - వీరఘట్టం

దసరా పండుగలో వాహనాలకు మొక్కులు చెల్లించేందుకు నాటు కోళ్ల అవసరమైంది. ఇదే అదును చూసిన వ్యాపారులు అమాంతంగా ధరలు పెంచేస్తున్నారు. ఒక్కొక్క కోడి రూ. వెయ్యి నుంచి రూ.1200 వరకు పలకడంతో నాటు కోళ్లకు భలే గిరాకీ పెరిగింది.

9664 మందికి పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో వితంతు, వృద్ధాప్య, చేనేత, కల్లుగీత, మత్స్యకార, డప్పు కళాకారులు, ఒంటరి మహిళ, చర్మకారులు, వికలాంగులు తదితర రకాలైన 9664 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ బి.వెంకటరమణ మంగళవారం తెలిపారు. వీరికి అక్టోబర్ 1న లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కుక్కల బారి నుండి ప్రజలకు ఉపశమనం

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో గత కొద్దిరోజులుగా అనేక మంది ప్రజలు కుక్కకాటులకు గురవ్వగా, మరికొంతమంది రహదారికి అడ్డంగా వచ్చి ప్రమాదాల బారినపడిన సంఘటన ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఇఒ సురేష్ ఆధ్వర్యంలో రాజమండ్రి నుంచి ప్రత్యేక బృందాలను తెప్పించి గ్రామంలో ఉన్న కుక్కలను పట్టి వ్యాన్ లో తీసుకెళ్లి ద్వార ప్రాంతాలకు మంగళవారం తరలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజలను కుక్కల బారి నుంచి ఉపశమనం కలిగించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఎన్నాళ్ల కెన్నాళ్లకు...

- అసెంబ్లీ లో ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఎమ్మెల్యే గళం
- జీవో అవర్‌లో వివక్ష చూపారంటూ ఆవేదన
- రూ. 200కోట్లు ఇస్తే ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని నివేదన

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర స్వపక్షంపైనే నిరసన గళం వినిపించారు. తాను అనేకసార్లు అసెంబ్లీ జీరో అవర్‌లో నియోజకవర్గ సమస్యలపై మాట్లాడేందుకు తన పేరు ఇచ్చానని, తనకు అవకాశం ఇవ్వలేదని, వివక్ష చూపారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. అనేక దశాబ్దాలుగా నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయంటూ ఆయన టిడిపి ప్రభుత్వానికి కూడా చురకలంటించారు. ఒడిశాతో వివాదం ఉన్న జంఝావతి ప్రాజెక్టును 1976లో ప్రారంభించారని, ఇంతవరకు పూర్తి చేయలేదని చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కూడా ఎన్నికల ముందు జంఝావతి ప్రాజెక్టుపై హామీ ఇచ్చారని, ఆ హామీలను విస్మరించారని ఆయన పరోక్షంగా చురకలంటించారు. జిల్లాలోని ప్రాజెక్టులన్నింటికీ రూ.200 కోట్లు మంజూరు చేస్తే నిర్మాణం పూర్తవుతాయని చెప్పారు. జిల్లాలో రెండు మీడియం, మూడు మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు వున్నాయన్నారు. అదే సమయం లో జిల్లా సమస్యల గురించి కాకుండా నియోజకవర్గ సమస్యలకు పరిమితం కావాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు వారించడం చర్చనీయాంశమైంది. రాకరాక వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నించినప్పటికీ డిప్యూటీ స్పీకర్ అడుగడుగునా అడ్డుపడిన తీరు ఆయన పట్ల ప్రభుత్వ వైఖరికి అద్దం పడుతోంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత ఎమ్మెల్యే బోనెల ఇరిగేషన్ ప్రాజెక్టులపై నోరు విప్పిన తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాను అనేకసార్లు జీరో అవర్‌లో నియోజకవర్గ సమస్యలపై మాట్లాడేందుకు ప్రయత్నించినా తనకు అవకాశం రాలేదని చెప్పడం, వివక్ష చూపారంటూ ఆవేదన వ్యక్తం చేయడం వెనుక ప్రభుత్వంపై అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు కనిపిస్తోంది. నియోజకవర్గానికి పక్కనే ఉన్న ఒడిశా లోని కొరాపుట్, రాయగడ ప్రాంతాలతో స్థానిక ప్రజలకు సంబంధాలు వున్నాయని, ఆంధ్రా కంటే ఒడిశాలోనే ప్రభుత్వ పాలన బాగుందని అక్కడి ప్రజలు చెప్పుకుంటున్నారని ఆయన అసెంబ్లీ సాక్షిగా చెప్పడం చర్చనీయాంశమవుతోంది. ఎమ్మెల్యేగా బోనెల ఏడాదిన్నర కాలంలో పనిచేసిన తీరుపై పార్టీ నాయకులు, కార్యకర్తలలో అసంతృప్తి నివురు కప్పిన నిప్పులా దాగివుంది. ఈ వ్యవహారంలో పార్టీ అధిష్టానం ఆయన పనితీరుపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న నేపథ్యంలో ఆయనకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నట్టు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే బోనెల నిండు సభలో ప్రభుత్వ తీరుపై నిరసన గళం వినిపించడం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది.


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర (ఫైల్)

ఆందోళన చేస్తున్న వాడబాయి గ్రామ గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు

మా గ్రామానికి రోడ్డు వేయండి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి నుండి వాడబాయి గ్రామానికి వెంటనే బిటి రోడ్డు నిర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు మండంగి సన్యాసిరావు మాట్లాడుతూ ఈ గ్రామంలో గతంలో మట్టి రోడ్డు వేశారని, అది ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయిందని తెలిపారు. దీంతో వాడబాయి గ్రామస్తులు హాస్పటల్‌కు, సంతకు వెళ్లాలంటే వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. మట్టి రోడ్డు బాగులేకపోవడం వల్ల ఆదివాసీ ప్రజలు డోలిమోతలతో రోగులకు, గర్భిణులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు కిల్లక సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్‌ను ఆవిష్కరణ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న మాజీడిప్యూటీ సిఎం పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి కేవలం వైసిపి నాయకులు, కార్యకర్తలను మాత్రమే లక్ష్యంగా చేశారని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్ప శ్రీవాణి అన్నారు. జియమ్మవలస మండలం చినమేరంగి క్యాంపు కార్యాలయంలో వైసిపి మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షితరాజు సమక్షంలో డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం చినమేరంగి కోటలో డిజిటల్ బుక్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బాబూజీ, కురుపాం ఎంపిపి పద్మావతి, జెడ్పీటీసీ సుజాత, జియ్యమ్మవలస జెడ్‌పిటిసి శశికళ, మండల కన్వీనర్ కోట రమేష్, గరుగుబిల్లి మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, నాయకులు లోలుగ నారాయణరావు, బలగ వెంకటరమణ, కిషోర్, కెంగువ వెంకట నాయుడు, ఆర్నిపల్లి వెంకటనాయుడు, ఉషారాణి, రవణమ్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: రెడ్ బుక్ సమానమే డిజిటల్ బుక్ అని వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములునాయుడు అన్నారు. స్థానిక వైసిపి నాయకులు ఆర్‌వి పార్థసారథి ఇంటి వద్ద డిజిటల్ బుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చి 15 నెలల కావస్తున్నా పాలనపై దృష్టి పెట్టకుండా వైసిపి కార్యకర్తలు, నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తుందని అన్నారు. అంతేకాకుండా అధికారులపై కూడా కక్ష సాధింపు చర్యలు చేపడుతుందన్నారు. దీనికి త్వరలో సమాధానం చెప్పడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.

కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఎన్.రామకృష్ణ, బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సర్పంచ్ బొన్నాడ తిరుపతిరావు, వైసిపి నాయకులు పి.ఈశ్వర నారాయణ, ఎన్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురైన రహదారి

మజ్జి గౌరమ్మ గుడిలోకి చేరిన వరదనీరు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారులపై వర్షపు నీరు ఏరులై పారడంతో కోతకు గురయ్యాయి. మక్కువ సువర్ణముఖీ నది సమీపంలో ఉన్న వంతెన వద్ద భారీ గొయ్యి ఏర్పడింది. అలాగే స్థానిక మజ్జి గౌరమ్మ గుడిలోకి, పూజారి ఇంట్లోకి వర్షపు నీరు భారీగా వచ్చి చేరడంతో వారంతా ఇబ్బందికి గురయ్యారు. మండలంలోని ఎ.వెంకంపేట, కన్నంపేట రహదారులకు ఆనుకొని ఉన్న చెరువుల నుంచి వరద ఉప్పొంగడంతో రహదారులపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందైంది. ఇప్పటి వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాన్ని తాము ఎప్పుడూ చూడలేదని, రాత్రివేళ కావడంతో భయాందోళన చెందాల్సి వచ్చిందని మండల ప్రజలు అంటున్నారు.

కోతకు గురైన వంతెన

గుడిలోకి చేరిన వరదనీరు

అర్ధాంతరంగా నిలిచిపోయిన హుస్సేపురం మీదుగా వెళ్లే రోడ్డు

బిటి రోడ్డు పనులు జరిగేనా?

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామాలకు బిటి రహదారి నిర్మాణ పనులు జరిగేనా అంటూ మండలంలోని నీలంపేట, ఎలిసిపురం, సందిమానుగూడ గ్రామాలకు చెందిన గిరిజనులు అనుమానంలో ఉన్నారు. 2019లో అప్పటి టిడిపి ప్రభుత్వం హుస్సేన్ పురం సెవెంత్ బ్రాంచ్ ప్రధాన ఎడమ కాలువ నుంచి హుస్సేన్ పురం మీదుగా నీలంపేట, ఎలిసిపురం, సందిమానుగూడ గిరిజన గ్రామం వరకు రూ.4.67 కోట్లతో ఉమ్మడి శ్రీకాకుళానికి చెందిన శ్రీ సాయి బాలాజీ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. మూడు చోట్ల శ్లాబ్ కలవర్టుతో పాటు ఆరు చోట్ల సాధారణ కల్వర్టు పనులు చేపట్టి రహదారిని చదును చేసి వాటిపై 40 ఎంఎం రాళ్ల పిక్కలు వేసి రోలింగ్ చేశారు. అయితే ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి దాదాపుగా ఆరేళ్లు పూర్తి కావస్తున్నా నేటికీ ఎటువంటి అభివృద్ధి పనులు జరగడంలేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రాళ్ల పిక్కలు పైకి తేలిపోవడంతో వాటిపై ప్రయాణించేందుకు సాహసించాల్సి వస్తుందని, ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె పండగ కార్యక్రమాల్లో ప్రతి గ్రామానికి రహదారులు సౌకర్యం కల్పిస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది తప్ప ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో తమకు అవస్థలు తప్పడం లేదని గిరిజనులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలకు బిటి రహదారి సౌకర్యం కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

రహదారి అధ్వానం... గిరిజనుల శ్రమదానం

ప్రజాశక్తి - కురుపాం

శ్రమదానంతో కాకిలి నుంచి లిక్కిడి వరకు గల రోడ్డును బాగుచేసుకుంటున్న గిరిజనులు

మండలంలోని వబ్బంగి పంచాయతీలో గల కాకిలి బిటి రోడ్డు జంక్షన్ నుంచి లిక్కిడి గ్రామం వరకు సుమారు ఐదు కిలోమీటర్లు రహదారి పూర్తిగా గుంతలమై మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం కోసంగూడ, తియ్యాలి, లిక్కిడిగూడ గిరిజనులు స్వచ్ఛందంగా పలుగు, పారపట్టి గుంతలన్నింటిని కప్పి రహదారికి ఇరు వైపులా ఉన్న తప్పలు, డొంకలను తొలగించి ప్రయాణ మార్గం సులభతరం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి సభ్యులు అడ్డమేశ్వరరావు మాట్లాడుతూ ఈ మరోడ్డు సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా కనీసం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డుపై కనీసం ద్విచక్ర వాహనంపై కూడా వెళ్లలేని పరిస్థితిలో రహదారి తయారైందనాను. దీంతో అనారోగ్య సమయంలో రోగులను డోలీపై తీసుకెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు, పాలకులు ఎలాగూ స్పందించలేదని మా మూడు గ్రామాల ప్రజలు అందరూ కలిసి ఏర్పడిన గుంతలను కప్పామని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలమయమైన రోడ్డుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి మా గిరిజనుల ప్రయాణాన్ని సులభతరం చేయాలని కోరారు.

అదుపులేని అక్రమ రవాణా

ఇసుక తవ్వకాలతో మృత్యుఒడిలోకి ..

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రానికి సమీపానున్న వట్టిగెడ్డలో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గెడ్డలో విపరీతంగా ఇసుక తవ్వకాలవల్ల పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడడంతో కాలకృత్యాల తీర్చుకునేందుకు వెళ్లిన ప్రజలు ప్రమాదస్తూ ఆ గోతుల్లో జారిపడి మృత్యువాత పడుతున్నారు. మండలంలోని కొట్టు గుమ్మడకు చెందిన ఉదయాన గౌరమ్మ, మండల కేంద్రంలోని బాబూ జగజ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన సంజీవులు ఇలాంటి ప్రమాదాలకు గురయ్యే మృత్యువాతపడ్డారు. ఆఖరుకు వీరి మృతదేహాలు కూడా లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులకు వేదన మిగిల్చింది. అలాగే మండలంలోని నడుకూరుకు గేదెల శ్రీనివాసరావు, కొట్టుగుమ్మడకు చెందిన రౌతు చిన్నమ్మడు ఇదే నెలలో ఒట్టిగెడ్డిలో గోతుల్లో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందారు. ఈ కారణంగా ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడే అధికారులు స్పందించి ఇటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప కనీస చర్యలు చేపట్టడంలేదు. దీంతో యథావిధిగా ఇసుక తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ కట్టడాల నివారణకు చర్యలు తీసుకోవాలని గెడ్డ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి - పాలకొండ

ఎల్‌విజిజె కాలేజ్ ఇంటర్ 1983-85 బ్యాచ్ విద్యార్థులు 40 ఏళ్ల తర్వాత మంగళవారం ఆ కళాశాలలో కలుసుకొని గత జ్ఞాపకాలను నెమర వేసుకున్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు యుఎస్ఎ నుంచి డివిడి ప్రసాద్, బీహార్ నుంచి నాగరాజు హైదరాబాద్ నుంచి మధుబాబు, ఏలూరు నుండి దుర్గాప్రసాద్ ఇలా అనేక ప్రాంతాల్లో గల మిత్రులు కలుసుకున్నారు. స్థానికంగా వెలమల అప్పారావు, వెలమల రంగాచారి, కందుల కుమార్, మంచు కరుణ తదితరులు ఉన్నారు.

కంపు కొడుతున్న నగర పంచాయతీ

రోడ్లపైనే చెత్తాచెదారం ◆ కాలువల్లో పేరుకుపోయిన మురుగు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ పట్టణంలోని రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం

స్థానిక నగర పంచాయతీ పాలకవర్గం, అధికారుల పనితీరు పరమ అధ్వానంగా ఉంది. పట్టణం పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పట్టణంలోని 20వార్డుల పరిధిలో గల 354 వీధుల్లో పారిశుధ్య అధ్వానంగా ఉంది. ఎక్కడిక్కడ రోడ్లపైనే చెత్త దర్శనమిస్తుంది. ప్రధాని రహదారులతో పాటు పలు వీధుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగానే ఉంది. కోమటిపేట, గొల్లవీధి, గురువు గారి వీధి, లుంబురు వారి వీధి, ఇందిరానగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు తీవ్ర అవస్థలుపడుతున్నారు. దీనికి తోడు దోమలు బెడద కూడా తీవ్రంగా ఉంది.

ప్రతి పనికి మామూళ్లు

స్థానిక నగర పంచాయతీలో వసూళ్ల పర్వం జోరుగా సాగుతుంది. ప్రతి పనికి ఎంతో కొంత సమర్పించుకోవాల్సి వస్తోంది. నిబంధనల పేరుతో ప్రజలను కాళ్లు అరిగేలా కార్యాలయానికి తిప్పి ఈ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. అలాగే ఇతర పనులకు కూడా ఒక రేటును పెట్టి వసూలు చేసి జేబు నింపుకుంటున్నట్లు సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆఖరు కు కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతాలు పెరిగే సమయంలో కూడా అధిక మొత్తంలో సొమ్ము ను చేసినట్లు తెలుస్తుంది. అధికారులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి యువకుడు మృతి

సీతానగరం : మండలంలోని అంటిపేట పంచాయితీ పరిధిలో గల వెంకటాపురానికి చెందిన సీరాపు సతీష్ పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల మేరకు సతీష్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆమె పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తండ్రి సీరాపు శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు.

మనస్తాపంతో నిరుద్యోగి ఆత్మహత్యాయత్నం

రామభద్రపురం: మండల కేంద్రంలో కనిమెరక వీధికి చెందిన కనిమెరక సాయివిశ్వనాద్ (25) పురుగు మందు సేవించి ఆత్మహత్యా యత్నం చేశారు. గత కొన్నేళ్లుగా ఉద్యోగ ప్రయత్నాలు ఏవీ అనుకూలించ కపోవడం ఎంబిఎలో ఉత్తమ పలితం సాధించినా నిరుద్యోగం వెంటాడడంతో జీవితంపై విరక్తి చెంది, మనస్తాపానికి గురై పురుగుల మందు తాగడంతో పాటు బ్లేడుతో చేయి మణికట్టు, మెడ దగ్గర కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసాడు. తీవ్ర రక్త స్రావంతో ఉన్న అతనిని కుటుంబ సభ్యులు గమనించి బాడంగి ప్రభు త్వ ఆసుపత్రికి తరలించి అక్కడ ప్రాథమిక చికిత్స తరు వాత వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. పూర్తి వివరాలు తెలి యాల్సి ఉంది.

అమ్మవారి దర్శనం కోసం క్యూ కట్టిన యాత్రికులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని కోట దుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు మంగళవారం క్యూ కట్టారు. విజయదశమి నవరాత్రుల్లో భాగంగా ప్రతిరోజు ప్రముఖ యజ్ఞకర్త సర్వ జోషుల శ్రీ వెంకటలక్ష్మి నరసింహ శర్మ యాజి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే విద్యుత్ అలంకరణతో దేవాలయం వెలుగులు వెదజల్లుతున్నాయి.